మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 211 | గురువారం | 05 - 02 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## భాజపాను మరింత పటిష్టపరచాలి




8లో..



- ఉద్యోగాలపై ప్రపంచవ్యాప్త భయం
- యంత్రాల వేగం... మానవ ఉద్యోగాలపై ఒత్తిడి
- ఆటోమేషన్ పేరుతో ఉద్యోగాల మాయం
- భవిష్యత్‌లో మనిషి పాత్ర ఏమిటి?

## ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో
# యుద్ధం

డెస్క్, మన గళం : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్‌గా కనిపించిన టెక్నాలజీ నేడు కార్యాలయాలు, పరిశ్రమలు, సేవా రంగాల్లో వాస్తవంగా మారింది. డేటా విశ్లేషణ నుంచి కస్టమర్ సపోర్ట్ వరకు, డిజైన్ నుంచి కంటెంట్ తయారీ వరకు అనేక రంగాల్లో యంత్రాలు మనుషుల స్థానాన్ని తీసుకుంటున్నాయి. ఈ వేగవంతమైన మార్పు ఉత్పాదకతను పెంచుతున్నా, అదే సమయంలో కోట్లాది ఉద్యోగులకు భయాన్ని కలిగిస్తోంది. "రేపు నా ఉద్యోగం ఉంటుందా?" అన్న ప్రశ్న ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది. ఆటోమేషన్ పేరుతో కంపెనీలు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాలు పెంచుతున్నాయి. ఒకే సాఫ్ట్‌వేర్, ఒకే అల్గారిథం వందల మంది చేసే పనిని క్షణాల్లో పూర్తి చేయగలుగుతోంది. ఫ్యాక్టరీల్లో రోబోట్లు, బ్యాంకుల్లో చాట్‌బాట్లు, మీడియా రంగంలో ఆటోమేటెడ్ టూల్స్ ఇవన్నీ సంప్రదాయ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తక్కువ నైపుణ్య ఉద్యోగాలే కాదు, చదువుకున్న వర్గాల ఉద్యోగాలకూ ప్రమాదం పొంచి ఉందన్న భావన బలపడుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఏఐ పూర్తిగా ముప్పేనా అన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. చరిత్రను పరిశీలిస్తే, ప్రతి సాంకేతిక విప్లవం కొన్ని ఉద్యోగాలను తొలగించినా, కొత్త అవకాశాలను కూడా సృష్టించింది. ఏఐ యుగంలోనూ కొత్త నైపుణ్యాలు, కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని 2 లో..





## ఆన్‌లైన్ గేమ్ బానిసత్వం
# ప్రాణాలు తీసింది

- 9వ అంతస్తు నుంచి దూకి ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య
- ఘజియాబాద్‌లో హృదయవిదారక ఘటన

మన గళం డెస్క్ : ఉత్తర ప్రదేశ్లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్‌కు బానిసలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. తల్లిదండ్రులు గేమ్ ఆడవద్దని మందలించడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటన 2 లో..

## భారత్‌అమెరికా ట్రేడ్ డీల్‌తో
# కీలక రంగాలకు రక్షణ



- భారత ఉత్పత్తులపై యూఎస్ సుంకాలు 18 శాతానికి తగ్గింపు
- ఎంఎస్‌ఎంఈలకు కొత్త అవకాశాలు: పీయూశ్ గోయెల్

మన గళం, న్యూఢిల్లీ : భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల వ్యవసాయం, పాడి పరిశ్రమల వంటి కీలక రంగాలకు పూర్తి రక్షణ లభిస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూశ్ గోయెల్ లోక్‌సభకు తెలిపారు. ఈ ట్రేడ్ డీల్ అమలుతో భారత వస్తువులపై అమెరికా విధిస్తున్న సుంకాలు గతంలో ఉన్న 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతాయని స్పష్టం చేశారు. ఇతర పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌పై యూఎస్ విధించిన సుంకాలు తక్కువగానే ఉన్నాయని పేర్కొన్నారు. భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థలు ఒకదానికొకటి 2 లో..



## క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ఆయుధం

- క్యాన్సర్ దినోత్సవంలో మంత్రి టీజీ భరత్
- అప్రమత్తంగా ఉంటే ఒక్క ఇంజెక్షన్‌తో క్యాన్సర్ నయం

మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ప్రధాన ఆయుధమని, ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా అదుపులోకి తీసుకురావచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని బచ్చు జానకిరాం 2 లో..

# రాయలసీమకు ద్రోహం చేసింది జగనే

- రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో జగన్ ప్రజా ధనం లూటి చేశారు.
- రాయలసీమకు వైసీపీ చేసిన ద్రోహంపై ముందు సమాధానం చెప్పాలి.
- దివంగత ఎన్ టీ ఆర్ వల్లే రాయలసీమకు తాగు, సాగునీరు.
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి



మన గళం,కర్నూలు పాతబస్తీ : రాయలసీమకు ఎక్కువ అన్యాయం చేసింది జగన్ పాలనలోనేనని, మీ ద్రోహంపై సమాధానం చెప్పి వైసీపీ సభ జరుపుకోండనీ, రాయలసీమకు టీడీపీ, వైసీపీ ఏమి మేలు చేసిందో కొండారెడ్డి బురుజు వద్ద చర్చకు వైసీపీ నాయకులు సిద్దమా అంటూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం కర్నూలు కంట్రోల్ రూమ్ వద్ద తన కాంప్లేక్స్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కృషి వల్లే తెలుగు గంగా, జి ఎన్ ఎస్ ఎస్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఏర్పడి తాగు, సాగు నీరు అందిందని,, 2 లో..

## ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ
# నరసింహ రెడ్డి పేరు పెట్టాలి

– కేంద్ర మంత్రి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి వినతి



మన గళం,,కర్నూలు : ఈనెల 22న జరిగే భారత స్వాతంత్ర్య తొలి పోరాట వీరుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా, ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంగా అనే పేరును అధికారికంగా ప్రకటించాలని బుధవారం న్యూ ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు ను కలిసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు ఎదురు నిలబడి ప్రాణాలర్పించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగానికి ఇదే నిజమైన నివాళి అని కేంద్ర మంత్రికి వివరించారు.



## పార్లమెంట్ వెలుపల
# మాటల యుద్ధం

- రాహుల్ వ్యాఖ్యలతో రాజకీయం వేడెక్కింది

మన గళం, న్యూఢిల్లీ : బుధవారం పార్లమెంట్ వెలుపల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఎంపీలు నిర్వహించిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర రాజకీయ చర్చకు దారి తీశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. నిరసన జరుగుతున్న సమయంలో అక్కడికి వచ్చిన బీజేపీ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టూ ను చూసిన రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2 లో..

# ఆన్‌లైన్ గేమ్ బానిసత్వం ప్రాణాలు తీసింది

మంగళవారం రాత్రి సుమారు 2.30 గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఘజియాబాద్కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. చిన్ననాటి నుంచి అన్ని పనులు కలిసి చేసుకునే ఈ అక్కాచెల్లెళ్లు, కోవిడ్ కాలంలో టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలయ్యారు. గంటల తరబడి గేమ్ ఆడుతూ గడిపేవారని, స్కూల్‌కు కూడా సరిగా వెళ్లేవారు కాదని పోలీసులు తెలిపారు. గేమ్‌కు పూర్తిగా అలవాటుపడిన వారు తమ పేర్లను కూడా కొరియన్ పేర్లుగా మార్చుకున్నారని సమాచారం. పిల్లల ప్రవర్తనపై ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఇకపై గేమ్ ఆడవద్దని మందలించడంతో, వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గేమ్ లేకుండా జీవించలేమన్న భావనలోకి వెళ్లి, ముగ్గురూ కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో మంగళవారం ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాసిన అనంతరం, రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులోని తమ ఫ్లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకారు. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు అక్కడికి చేరుకుని, నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న ముగ్గురిని చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ముగ్గురూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# భారత్‌అమెరికా ట్రేడ్ డీల్‌తో కీలక రంగాలకు రక్షణ

పూరకంగా ఉన్నాయని పీయూశ్ గోయెల్ తెలిపారు. వికసిత్ భారత్ దిశగా దేశం ముందుకు సాగుతున్న తరుణంలో ఇంధనం, విమానయానం, డేటా సెంటర్లు, అణు ఇంధనం వంటి రంగాల్లో సామర్థ్యాన్ని పెంచుకోవడం అత్యంత అవసరమని చెప్పారు. ఈ రంగాల్లో అమెరికా అగ్రగామిగా ఉండటంతో, వాణిజ్య అవకాశాలపై భారత్ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. దీని వల్ల భారత దిగుమతులు పెరుగుతూనే, ఎగుమతులు కూడా విస్తరిస్తాయని వివరించారు.

గత ఏడాది కాలంగా ఇరుదేశాల మధ్య వివిధ స్థాయిల్లో లోతైన చర్చలు జరిగాయని పీయూశ్ గోయెల్ వెల్లడించారు. ఇరుపక్షాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యంగా వ్యవసాయం, పాడి రంగాల ప్రయోజనాలను విజయవంతంగా కాపాడగలిగామని తెలిపారు. 2026 ఫిబ్రవరి 2న ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు లిడొనాల్డ్ ట్రంప్‌లితో టెలిఫోన్ ద్వారా చర్చలు జరిపిన అనంతరం, భారత ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు యూఎస్ ప్రకటించిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు, నైపుణ్యం కలిగిన కార్మికులకు కొత్త అవకాశాలు లభిస్తాయని గోయెల్ చెప్పారు. అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో 'మేక్ ఇన్ ఇండియా', 'డిజైన్ ఇన్ ఇండియా', 'ఇన్నోవేటివ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' లక్ష్యాలు సాకారం కావడంలో ఈ డీల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇది భారతదేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చే దిశగా ముందడుగు అని తెలిపారు. భారతీయులకు ఇంధన భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని పీయూశ్ గోయెల్ స్పష్టం చేశారు. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఇంధన వనరులను వైవిధ్యపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. విమానయాన, అణు రంగాలకు అవసరమైన గూడ్స్ విషయంలో అమెరికా భారత్‌కు కీలక భాగస్వామి అని పేర్కొన్నారు. ఈ చారిత్రక, నిర్మాణాత్మక ఒప్పందం భారత్‌అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# పార్లమెంట్ వెలుపల మాటల యుద్ధం

ఒకప్పుడు తన సహచరుడిగా ఉన్న బిట్టూను ఉద్దేశించి 'మిత్ర ద్రోహి'గా అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, కరచాలనం చేయడానికి చేయి ముందుకు చాచి, "హలో బ్రదర్‌డ మిత్ర ద్రోహి. కంగారు పడకు, నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావు" అని వ్యాఖ్యానించారు. అయితే రాహుల్ గాంధీ కరచాలనాన్ని రవ్‌నీత్ సింగ్ బిట్టూ తిరస్కరించారు. వెంటనే కౌంటర్‌గా రాహుల్‌ను 'దేశద్రోహి'గా అభివర్ణిస్తూ తీవ్రంగా స్పందించారు. "ఏదో యుద్ధంలో గెలిచినట్లుగా వచ్చి ఇక్కడ కూర్చున్నారు" అంటూ వ్యాఖ్యలు చేసి అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య కొద్ది సెకన్ల పాటు మాటల యుద్ధం చోటుచేసుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడిన రవ్‌నీత్ సింగ్ బిట్టూ బీజేపీలో చేరారు. అప్పటి నుంచే రాహుల్ గాంధీ, బిట్టూ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజా ఘటనతో పార్లమెంట్ ప్రాంగణంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.



# ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో యుద్ధం

నిపుణులు చెబుతున్నారు. కానీ సమస్య ఏమిటంటే మార్పుకు సిద్ధంగా లేని వర్క్‌ఫోర్స్. రీ–స్కిల్లింగ్, అప్–స్కిల్లింగ్ లేకపోతే, ఈ మార్పు సామాజిక అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. విద్యా వ్యవస్థలను ఆధునీకరించడం, కొత్త నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం, సామాజిక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం తప్పనిసరి. టెక్నాలజీ మనిషికి సేవ చేయాలే తప్ప, మనిషిని అప్రయోజకుడిగా మార్చకూడదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుద్ధంలో గెలవాల్సింది యంత్రాలు కాదు మానవత్వమే.

# రాయలసీమకు ద్రోహం చేసింది జగనే

రాయలసీమ ద్రోహనిక పాల్పడి మళ్ళీ బహిరంగ సభనా వైసీపీ కీ ఛిగ్గుండాలనీ. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టు లకు ఒక గంప మట్టి వేశావా జగన్, జీ ఓ 365 పేరుతో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టు లకు మరణశాసనం రాసింది నువ్వు కాదా జగన్ అంటూ బైరెడ్డి మండి పడ్డారు. కరువు, అప్పులు, నిరుద్యోగం రాయ లసీమను వెంటాడుతున్నాయని, ప్రాజెక్టు కట్టి పొలాలకు నీరు ఇచ్చి చీకటి తరిమి కొట్టాలనీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు తన నాయకత్వంలో అనే పోరాటాలు, ఉద్యమాలు చేసి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికీ రాయలసీమ కష్టాలు చెప్పామని బైరెడ్డి రాజశేఖరరెడ్డి వివరించారు. మా వెతలు పోతుందన్న ఆశా తో ఉన్న రాయలసీమ ప్రజలకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో రాయల సీమకు కాకుండా నెల్లూరు జిల్లా రిజర్వాయర్లకు నీరు తరలించాలనుకోవడం ద్రోహం కాదా జగన్ అని బైరెడ్డి నిలధీశారు. రాయలసీమకు కేసీఆర్, జగన్ లు తోడు దొంగలు అని బైరెడ్డి అన్నారు. ఒకే కంచం, ఒకే మంచం లో ఉన్న జగన్, కేసీఆర్ పాలనలోనే ప్రజా ధనం దోచుకునేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకం తెచ్చారని, ఇది సాధ్యం కాదని ఆ నాడే జగన్ ప్రభుత్వం కు తాను సూచనలు చేశానన్నారు. జగన్ పాలనలో సక్రమ ంగా అనుమతులు లేవని రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోతే తన తప్పిదం కప్పిపు చ్చుకునేందుకు సీఎం చంద్రబాబు ఆపారు అనడం సరి కాదన్నారు. బానకచర్ల కాంప్లెక్స్ వద్ద ఎస్ ఆర్ బి సి, తెలుగుగంగ ప్రధాన కాలువల నీటి ప్రవాహానికి అడ్డం వేసి ఎస్కేప్ ఛానల్ ద్వారా కుందూనదిలో పోసి ఐదేళ్ళు రాయలసీమకు కాకుండా నెల్లూరు కు తరలించింది నిజం కాదా జగన్ అన్నారు. కృష్ణా యాజమాన్యబోర్డు విశాఖ పట్నం లో పెట్టాలని జగన్ నిర్ణయం చాలా బాధేసిందని బైరెడ్డి అన్నారు. నీటి నిలువ రిజర్వాయర్లు రాయలసీమ లో నిర్మాణం చేయకుండా రోజుకు 3 టీ ఎం సి ల నీరు తోడి ఏమి చేస్తావ్ జగన్, రూ. 6 వేల కోట్లు ధోసుకోవడం కోసమే కదా అన్నారు. కేవలం రూ. 900 కోట్ల తో సిద్దేశ్వరం వద్ద కృష్ణానది పై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేస్తే సంగమేశ్వరం వద్ద 60 టీ ఎం సి ల నీరు నిలిచి రాయలసీమ ప్రాజెక్టు లకు అంది కరువు, వలసలు, నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనీ, ఆ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని బైరెడ్డి రాజశేఖరరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేముల శ్రీధర్, మల్లెల పుల్లారెడ్డి, నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సీమ కృష్ణ, రవి కుమార్, రఘునాథ్ రెడ్డి, వీరాపురం కె వి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ఆయుధం

ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పారిశుద్ధ్య కార్మికులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ముందస్తు పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా 9 నుండి 14 ఏళ్ల కార్మికుల పిల్లలకు క్యాన్సర్ నిరోధక టీకాలు వేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. క్యాన్సర్‌పై భయం కాకుండా జాగ్రత్త అవసరమని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం చేయించుకోవాలని మంత్రి సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యాయామం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద వైద్య సంస్థలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతలో నగరాన్ని టాప్ 5లో ఉంచడం మంత్రి టీజీ భరత్‌తోనే సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి వైద్యుల సూచనలు పాటిస్తే కొంతమంది క్యాన్సర్ నుంచి ఒకే ఇంజెక్షన్‌తో రక్షణ పొందే అవకాశముందని చెప్పారు.

కమిషనర్ మాట్లాడుతూ.. నగర స్వచ్ఛతలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించి బచ్చు జానకిరాం ఫౌండేషన్ వారు రూ.2,500 విలువైన క్యాన్సర్ నిరోధక టీకాను కార్మికుల పిల్లలకు ఉచితంగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్మికుల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు తాము అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బచ్చు జానకిరాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.రవీంద్ర బాబు, బి.సాయివాణి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సులో తమవంతు సామాజిక బాధ్యతగా అనేక కార్యక్రమాలు చేపట్టామని, క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఒక్కొక్కటి రూ.2,500 విలువైన హెచ్‌పీవీ క్యాన్సర్ నిరోధక టీకాలను ఇప్పుడు ఒకసారి, ఆరు నెలల తర్వాత మరోసారి వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్

మన గళం, గుంటూరు : గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని, ప్రస్తుతం జంగిల్ రాజ్ నడుస్తోందని జగన్ తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం గుంటూరు పర్యటనలో భాగంగా ఇటీవల దాడికి గురైన అంబటి రాంబాబు నివాసానికి వెళ్లిన జగన్, ధ్వంసమైన ఇంటి పరిస్థితిని, వాహనాలను పరిశీలించారు. గుడి నుంచి వస్తున్న సమయంలో అంబటిపై టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో దాడి చేశారని, పోలీసుల సమక్షంలోనే కార్లను పగలగొట్టారని ఆరోపించారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితుడైన అంబటిపైనే కేసులు పెట్టడం దారుణమని మండిపడ్డారు. బాధితుడిని అరెస్ట్ చేసి, దాడికి పాల్పడ్డవారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం అన్యాయమని జగన్ విమర్శించారు. ఇలాంటి చర్యలతో వైసీపీ నాయకులను భయపెట్టగలమని భావిస్తే అంతకంటే మూర్ఖత్వం లేదన్నారు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదని, మూడేళ్లలో మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందని స్పష్టం చేశారు. "మా ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన తప్పులకు వడ్డీతో సహా చెల్లిస్తారు" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్లకు జగన్ ఘాటు హెచ్చరిక చేశారు. అనంతరం తిరుమల నెయ్యి వివాదంపై స్పందించిన జగన్, నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయని తెలిపారు.

## డబుల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నందు మొదటి స్థానము యంగ్ స్టార్స్ శ్రీ జట్టు రెండో స్థానం కింగ్స్ - జట్టు గెలుపొందారు

మన గళం కోడుమూరు: మన ఊరు మన జాతర,శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి తిరునాళ్ల సంధర్భంగ కోడుమూరు సాంస్కృతిక క్రీడాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో డబుల్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఎస్ ఆర్ టి గ్రౌండ్స్ లో డాక్టర్ రఘురామిరెడ్డి పర్యవేక్షణలో జనవరి 28 2026 నుండి ఫిబ్రవరి మూడో తారీకు వరకు ఈ టోర్నమెంట్ జరిగింది ఈ డబుల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నందు 30 జట్లు పాల్గొన్నాయి ఈ టోర్నమెంట్ లో ఒకటో బహుమతి 50,000 పాలవారి భాస్కర్ రెడ్డి మరియు రెండో బహుమతిగా 25000 కోడుమూరు హై స్కూల్ 2023 మరియు 2024 ఎస్ఎస్సి బ్యాచ్ వారు అందించారు అలాగే ఈ టోర్నమెంట్ కు ట్రోఫీలను 90 ఎం.ఎల్ టీ స్టాల్ ఉదయ్ కిరణ్ గౌడ్ దాతగా నిలిచారు అలాగే ప్రతి జట్టుకు నక్షత్ర మొబైల్స్ వారు మేనేజ్ ది మ్యాచ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అదనపు బహుమతులను అందజేశారు ఈ టోర్నమెంట్లో ఫైనల్ మ్యాచ్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రాజు యంగ్ స్టార్స్ శూ జట్టు కైవసం చేసుకున్నాయి అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఉరుకుంద కింగ్స్ ఎక్స్ ఠ1 జట్టు దక్కించుకుంది చివరిగా మంగళవారం రోజు ఫైనల్ చేరిన రెండు జట్లు యంగ్ స్టార్స్ శ్రీ మరియు కింగ్స్ శూ ఒకరికొకరు పోటీపడి తమ యొక్క ప్రతిభను చాటుకున్నారు చివరిగా కెప్టెన్ అజయ్ కుమార్ సారధ్యంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ నందు యంగ్ స్టార్స్ శ్రీ జట్టు 45 పరుగుల తేడాతో కింగ్స్ జట్టు పై గెలిచింది పాటు నగదు బహుమతి 50,000/- మరియు 25000/- అందజేసారు. ఈ విజయాన్ని యూత్ కి అంకితం చేస్తున్నట్టు టీమ్ ప్లేయర్లు అజయ్, గిరి, శివ, విక్కీ, మధు రాజ్, సంజీవ్ మరియు సహచరులు తెలియజేసారు.





మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## టిప్పర్ కు భారీ జరిమానా విధించిన ఆర్టీవో క్రాంతి కుమార్




మన గళండోన్ : మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఆర్టీవో క్రాంతి కుమార్ఈరోజు బుధవారం జరిపిన సాధారణ తనిఖీల్లో భాగంగా డోన్ నేషనల్ హైవే 44 దత్తాత్రేయ గుడి వద్ద ఒక టిప్పర్ 26 0219 ను ఆపి తనిఖీ చేయడం జరిగినది. రెండు సంవత్సరాలుగా ఫిట్నెస్ మరియు మూడు సంవత్సరాల నుండి రోడ్ టాక్స్ కట్టకుండా వెల్దుర్తి వద్ద రైల్వే కాంట్రాక్టు వర్క్ చేస్తునట్టు గుర్తించి 2,45,000/- (రెండు లక్షల నలభైఅయిదు వేల రూపాయలు) జరిమానా విధించారు. అనంతరం డోన్ ¬జ డిపో కు తరలించారు.

## మాజీ మంత్రి బుగ్గన సొంత కుటుంబ సభ్యులు టిడిపిలో చేరిక






మనగళంబేతంచెర్లలిబుగ్గన అహంకారపూరిత వైఖరికి వ్యతిరేకంగా ఆయన సొంత కుటుంబ సభ్యులే అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కోట్ల కుటుంబం సేవలను, వారి రాజకీయ నిజాయితీని గుర్తించి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న కోట్ల కుటుంబ నాయకత్వంపై విశ్వాసం ప్రకటిస్తూ, వైసీపీని వీడిన బేతంచర్ల పట్టణానికి చెందిన బుగ్గన చంద్రారెడ్డి సతీమణి బుగ్గన విజయలక్ష్మి, వారి కుమారుడు బుగ్గన ఉదయ్ కిరణ్ రెడ్డి, తాసిల్‌పేటకు చెందిన నజీర్ మక్బుల్ కుటుంబ సభ్యులతో పాటు, సంజీవ్ నగర్‌కు చెందిన రామదుర్గం మధు, చనుగొండ్ల ఎర్రమల, సంజీవ్ నగర్ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు స్వచ్ఛందంగా టిడిపిలో చేరడం విశేషం. ఈ సందర్భంగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ నూతనంగా పార్టీలో చేరిన వారందరికీ కండువా కప్పి, టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు.

## ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి వర్యుల పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయండి

**- సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్**

మన గళం,కర్నూలు : 6వ తేదీన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటిస్తున్న నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి వర్యుల పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ఫిబ్రవరి 6 వ తేది నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్యులు పాల్గొననున్న నేపథ్యంలో హెలిప్యాడ్, ప్రజావేదిక తదితర ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తూ ఎంట్రన్స్ లో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ఎక్కువ మంది రైతులు వచ్చే అవకాశం ఉన్నందున బ్యారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు పై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. హెలిప్యాడ్, పార్టీ కార్యకర్తల సమావేశపు ప్రదేశాలను పరిశీలించారు అనంతరం హెలిప్యాడ్, రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ఈ నెల 6 వ తేదీన ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి ఆర్డీఓ అజయ్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, డిపిఓ భాస్కర్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సింగల్ విండో చైర్మన్ కు సన్మానం చేసిన బిజెపి యువ నాయకులు



మన గళండోన్ డోన్ కోఆపరేటివ్ బ్యాంక్ సింగిల్ విండో ప్రెసిడెంట్ గా చనుగొండ్ల శ్రీరాములు ను నియమించినందుకు డోన్ బిజెపి యువ నాయకుడు రాజపుత్ర కమలేష్ , ఆర్మీ రామయ్య కలసి శాలువాతో సన్మానం చేశారు. వారు ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట వేసిందని తెలిపారు.

## గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ...

**- కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**
**- 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు.**
**- పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.**
**- ఏర్పాట్ల పై ఆరా తీసి పరిశీలించిన ... కర్నూలు ఎస్పీ .**

2026, ఫిబ్రవరి, 6న(శుక్రవారం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎమ్మిగనూరు మండలం , కలుగొట్ల గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో హెలిప్యాడ్, ప్రజావేదిక ఏర్పాట్లను కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి గారు ,కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ గారు , ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి గారు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గారు భద్రత ఏర్పాట్లను బుధ వారం పరిశీలించారు. ముఖ్యంత్రి గారి హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , ఇతర భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పటిష్ట భద్రత కు పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి మాట్లాడారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంయుక్తంగా రెవిన్యూ , పోలీసులు గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు పర్యటించే రూట్ ఙ రూఫ్ - టాప్ ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, సభ ప్రాంగణం ,తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు ,పోలీసు జాగీలాలు ,బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు , పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. కర్నూలు, కడప, నంద్యాల,అన్నమయ్య జిల్లాల పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించారు. ఇందులో జిల్లా ఎస్పీ గారితో పాటు ముగ్గురు అడిషనల్ ఎస్పీలు , 8 మంది డిఎస్పీలు, 55 మంది సిఐలు, 88 మంది ఎస్సైలు , 297 మంది ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుళ్ళు ,485 మంది కానిస్టేబుళ్ళు , 61మంది మహిళా పోలీసులు, 191 మంది హోంగార్డులు, 2 సెక్షన్ల ఎఆర్ పోలీసులు, 14 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ గారులతో పాటు సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ గారు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ , ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి, హోంగార్డు డిఎస్పి ప్రసాద్ , కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గారు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణమ్మ గారు, సిఐలు, ఎస్సైలు ఉన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయం - కర్నూలు.

## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 04.02.2026) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకట హరచవితి రోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షి గణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షి గణపతి స్వామి వారికి పంచా మృతాలతోనూ, పలుఫ లోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

## లోకేష్ నిర్వహించిన ఎంపీ ల సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పలువురు కేంద్ర మంత్రులతో సమావేశంలో భాగంగా ఢిల్లీలో పర్యటించిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన స్వగృహంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు...ఈ కార్యక్రమంలో సహచర టీడీపీ ఎంపీలతో కలిసి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు..ఈ సందర్బంగా ఎంపీ నాగరాజు లోకేష్ కి శాలువాతో సత్కరించారు... విందు అనంతరం మంత్రి లోకేష్ ఎంపీలతో సమావేశామయ్యారు...రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం అందరు కలసికట్టుగా పని చేయడం తో పాటు,రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా సమన్వయతో ముందుకు సాగాలని సమావేశంలో లోకేష్ సూచించినట్లు ఎంపీ నాగరాజు తెలిపారు...



## ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (04.02.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది.ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

# థాయ్‌లాండ్ మాస్టర్స్ ఛాంపియన్‌గా దేవికా సిహాగ్..




బ్యాంకాక్ , 04 ఫిబ్రవరి 2026 ,మనగళం: భారత యువ షట్లర్ దేవికా సిహాగ్ థాయ్‌లాండ్ మాస్టర్స్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచి దేశానికి గర్వకారణంగా మారింది. ఈ విజయం ద్వారా దేవిక తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టైటిల్‌ను సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన 20 ఏళ్ల దేవిక, ఫైనల్లో మలేసియాకు చెందిన ప్రపంచ 68వ ర్యాంకర్ గో జిన్ వెతో తలపడింది.ఫైనల్ మ్యాచ్‌లో దేవిక తొలి గేమ్‌ను ఏకంగా 21-8తో సులభంగా గెలుచుకుంది. రెండో గేమ్‌లో కూడా 6-3 ఆధిక్యంలోకి వెళ్లిన సమయంలో ప్రత్యర్థి గో జిన్ వె గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగడంతో దేవిక విజయం ఖరారైంది. ఈ టోర్నీ మొత్తం దేవిక ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా టైటిల్ సాధించడం విశేషం.ఈ విజయంతో దేవికకు 18750 డాలర్ల ప్రైజ్ మనీతో పాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పీవీ సింధు, సైనా నెహ్వాల్ తర్వాత థాయ్‌లాండ్ సూపర్ 300 టైటిల్ గెలుచుకున్న మూడో భారతీయ క్రీడాకారిణిగా దేవిక చరిత్ర సృష్టించింది.టైటిల్ అనంతరం దేవిక మాట్లాడుతూ.. తన కెరీర్‌లో ఇదే తొలి సూపర్ 300 స్థాయి టైటిల్ కావడంతో ఎంతో ఆనందంగా ఉందని తెలిపింది. ఈ సీజన్‌లో మరిన్ని టోర్నీల్లో పాల్గొని మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న లక్ష్యం ఉందని పేర్కొంది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపోటముల గురించి కాకుండా తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించడంపైనే దృష్టి పెట్టానని చెప్పింది.ప్రస్తుతం దేవిక బెంగళూరులోని పదుకొనే--ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో కోచ్ ఉమేంద్ర రాణా వద్ద శిక్షణ పొందుతోంది. ఈ విజయం భారత బ్యాడ్మింటన్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఎయిర్‌టెల్ నుంచి రెండు అదిరిపోయే ప్లాన్స్..




హైదరాబాద్ ,04 ఫిబ్రవరి 2026,మనగళం: టెలికాం రంగంలో పోటీ మరింత పెరుగుతున్న వేళ ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం రెండు కొత్త రీఛార్జ్ ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటర్నెట్ వినియోగం ఎక్కువగా చేసే యువత, వర్క్ ఫ్రం హోమ్, వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్ చేసే వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని ఈ ప్లాన్‌లను రూపొందించింది. రూ.399, రూ.449 ధరలతో వచ్చిన ఈ రెండు ప్లాన్‌లు 28 రోజుల చెల్లుబాటుతో అందుబాటులో ఉన్నాయి. రెండు ప్లాన్‌లలోనూ అన్‌లిమిటెడ్ లోకల్, ఎస్‌టిడీ, రోమింగ్ కాలింగ్‌తో పాటు రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లు లభిస్తాయి. ముఖ్యంగా 5జీ కవరేజ్ ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులకు అన్‌లిమిటెడ్ 5జీ డేటా సదుపాయం అందించనుంది. రూ.399 ప్లాన్‌లో రోజుకు 2.5జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. దీంతో పాటు వినోద ప్రియుల కోసం 28 రోజుల జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఇస్తోంది. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, లైవ్ క్రీడా ప్రసారాలు వీక్షించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇక రోజూ ఎక్కువ డేటా అవసరమయ్యే వారికి రూ.449 ప్లాన్ మరింత ఆకర్షణీయంగా ఉంది. ఈ ప్లాన్‌లో రోజుకు 4జీబీ హైస్పీడ్ డేటాతో పాటు అన్‌లిమిటెడ్ 5జీ డేటా లభిస్తుంది. అదనంగా 30జీబీ గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజ్ కూడా అందిస్తోంది. ఫోటోలు, వీడియోలు, ఫైల్స్ నిల్వ చేసుకునే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. బడ్జెట్‌లో 5జీ వేగం, ఓటీటీ వినోదం కావాలనుకునేవారికి రూ.399 ప్లాన్ అనువైనదిగా ఉండగా.. డేటా వినియోగం ఎక్కువగా ఉండే వారికి, క్లౌడ్ స్టోరేజ్ అవసరమయ్యే వారికి రూ.449 ప్లాన్ మరింత ప్రయోజనకరంగా ఉంటుందని టెలికాం నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్‌టెల్ ఈ ప్లాన్‌లతో జియోతో పోటీకి దిగినట్టుగా కనిపిస్తోంది.

# తగ్గిన జోరు.. రెండు రోజుల లాభాలకు బ్రేక్..



హైదరాబాద్ , 04 ఫిబ్రవరి 2026 ,మనగళం: దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా కొనసాగిన లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో ప్రధాన సూచీలు స్వల్ప లాభాలతోనే ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 78.56 పాయింట్లు స్వల్పంగా పెరిగి 83,817.69 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 48.45 పాయింట్లు లాభపడి 25,776.00 వద్ద ముగిసింది.

కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తుండటంతో ఐటీ రంగ భవిష్యత్తుపై పెట్టుబడిదారుల్లో కొత్త ఆందోళనలు నెలకొన్నాయి. న్యాయవాదుల కోసం కొత్త ఏఐ టూల్ విడుదల కావడంతో సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలపై డిమాండ్ తగ్గే అవకాశం ఉందన్న భావన మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీని ప్రభావంగా నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 6 శాతం కుప్పకూలింది. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా వంటి ఐటీ దిగ్గజాలు ప్రధాన నష్టాలను చవిచూశాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కూడా నెగెటివ్‌లో ముగిశాయి. మరోవైపు ఎటర్నల్, ట్రెంట్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాలతో మార్కెట్‌కు మద్దతునిచ్చాయి. రంగాల వారీగా చూస్తే ఐటీతో పాటు ఫార్మా రంగం స్వల్ప నష్టాల్లో ముగిసింది. అయితే కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ 2.6 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 2 శాతం లాభపడటం వల్ల మార్కెట్ పతనం కట్టడి అయ్యింది. ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.63 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.27 శాతం లాభపడింది. నిపుణుల విశ్లేషణ ప్రకారం నిఫ్టీ రోజంతా 25,680 నుంచి 25,820 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. 25,800 స్థాయిని దాటిన తర్వాతే సూచీలో తదుపరి దశ లాభాల బాట పడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.


# రోజుకు వంద రూపాయలు దాచితే చాలు..




హైదరాబాద్, 04 ఫిబ్రవరి 2026,మనగళం: ప్రస్తుత కాలంలో ఆర్థిక భద్రత ప్రతి కుటుంబానికీ కీలకంగా మారింది. పెరుగుతున్న ఖర్చులు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పొదుపు తప్పనిసరి. అయితే ఒకేసారి పెద్ద మొత్తం దాచడం అందరికీ సాధ్యం కాకపోవడంతో చిన్న మొత్తాలతో పెద్ద నిధిని సమకూర్చుకునే మార్గాల కోసం చాలా మంది వెతుకుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వ భరోసాతో నడిచే పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం మంచి అవకాశం కల్పిస్తోంది.

ఈ పథకం ఐదేళ్ల కాలపరిమితితో అమలులో ఉంటుంది. ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని ఖాతాలో జమ చేస్తూ చివరికి పెద్ద మొత్తాన్ని పొందే వీలుంది. ప్రస్తుతానికి పోస్టాఫీస్ ఆర్‌డీపై ఏటా 6.7 శాతం వడ్డీ అందిస్తోంది. ఇది పూర్తిగా ప్రభుత్వ పథకం కావడంతో పెట్టుబడిపై పూర్తి భద్రత ఉంటుంది. రోజుకు కేవలం వంద రూపాయలు పక్కన పెడితే నెలకు సుమారు మూడు వేల రూపాయలు జమ చేయవచ్చు. ఏడాదికి ఈ మొత్తం ముప్పై ఆరు వేల రూపాయలుగా ఉంటుంది. ఐదేళ్లలో మొత్తం అసలు పెట్టుబడి లక్ష ఎనభై వేల రూపాయలు అవుతుంది. ఈ మొత్తానికి వడ్డీ కలిపితే ఐదేళ్ల చివరికి సుమారు రెండు లక్షల పద్నాలుగు వేల రూపాయలకు పైగా మీ చేతికి వచ్చే అవకాశం ఉంది. అంటే మీ పొదుపుపై అదనంగా సుమారు ముప్పై నాలుగు వేల రూపాయల వరకు లాభం లభిస్తుంది. ఈ ఖాతాను భారతీయ పౌరులెవరైనా తెరవవచ్చు. మైనర్ల పేరుతో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఖాతా ప్రారంభించవచ్చు. కనీసంగా వంద రూపాయలతో కూడా ఈ పథకంలో చేరవచ్చు. గరిష్ట పెట్టుబడి పరిమితి లేకపోవడం మరో ప్రయోజనం. భవిష్యత్ అవసరాలు, పిల్లల చదువు, ఇల్లు కట్టుకోవడం వంటి లక్ష్యాల కోసం చిన్న మొత్తాలతోనే పెద్ద నిధిని సమకూర్చుకునే భద్రమైన మార్గంగా పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం నిలుస్తోంది.

# రూ.6 వేలు పెరిగిన బంగారం..



హైదరాబాద్ , 04 ఫిబ్రవరి 2026 ,మనగళం: అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ నేపథ్యంలో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు పెరిగాయి. ఇటీవల లాభాల స్వీకరణ కారణంగా భారీగా పడిపోయిన ధరలు మళ్లీ పుంజుకుంటుండటం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. గత రెండు రోజులుగా బులియన్ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు క్రమంగా పెరుగుతూ కొత్త స్థాయిలను తాకుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం ఉదయం గం.11:30 సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,64,400కు చేరుకుంది. నిన్నటి ధర రూ.1,58,500తో పోలిస్తే ఒక్కరోజులోనే దాదాపు రూ.6 వేలు పెరగడం గమనార్హం. ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. నిన్న కిలో రూ.2,79,600గా ఉన్న వెండి ధర ఈరోజు రూ.14 వేలు పెరిగి రూ.2,93,900కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు బలంగా ట్రేడవుతున్నాయి. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 5,080 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి ఔన్సు ధర 87.95 డాలర్లకు చేరింది. అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరగడం, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి వాతావరణం నెలకొనడం వల్ల సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండిపై డిమాండ్ పెరుగుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, డాలర్ మారకం విలువ, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్‌ను బట్టి బంగారం, వెండి ధరల్లో మరింత ఒడిదుడుకులు కనిపించే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటివరకు ధరల పతనం కోసం ఎదురుచూసిన వినియోగదారులు.. మళ్లీ పెరిగిన ధరలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌లో అమ్మకాలు పెంచుకునేందుకు టెస్లా కొత్త ప్రణాళిక..



హైదరాబాద్, 04 ఫిబ్రవరి 2026 ,మనగళం:భారత మార్కెట్లో ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో ఎలాన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లా సరికొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. ప్రీమియం ధరల కారణంగా తగ్గిన డిమాండ్‌ను పెంచుకునేందుకు ఈఎంఐ సౌకర్యాలు, పాత కారు మార్పిడిపై ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీలో కంపెనీ అధికారికంగా తన కొత్త ప్రణాళికలను వెల్లడించింది.

టెస్లా మోడల్ వై కారును కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఇప్పుడు సులభమైన చెల్లింపు విధానాన్ని అందిస్తోంది. రూ.6 లక్షల డౌన్ పేమెంట్‌తో నెలకు రూ.49 వేల ఈఎంఐ చెల్లిస్తూ ఈ ప్రీమియం ఎలక్ట్రిక్ కారును సొంతం చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే పాత పెట్రోల్ లేదా డీజిల్ కారును మార్పిడి చేసుకునే వినియోగదారులకు గరిష్టంగా రూ.3 లక్షల వరకు ఎక్స్ఛేంజ్ ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఈ చర్యల ద్వారా ఎక్కువ మంది వినియోగదారులను టెస్లా వైపు ఆకర్షించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. టెస్లా కారు వినియోగం వల్ల ఇంధన ఖర్చులు, నిర్వహణ వ్యయాల్లో నెలకు సుమారు రూ.20 వేల వరకు ఆదా అవుతుందని కంపెనీ పేర్కొంది. దీంతో నెలవారీ వాస్తవ ఖర్చు ఈఎంఐతో కలిపి సుమారు రూ.29 వేల వరకు మాత్రమే ఉంటుందని వివరించింది. దీర్ఘకాలంలో ఇది సాధారణ ఇంధన కార్లతో పోలిస్తే వినియోగదారులకు లాభదాయకంగా మారుతుందని టెస్లా చెబుతోంది.

గత ఏడాది భారత మార్కెట్లో అడుగుపెట్టిన టెస్లా మోడల్ వైకి తొలుత మంచి స్పందన లభించినప్పటికీ, అధిక ధర కారణంగా అమ్మకాలు క్రమంగా తగ్గాయి. గత సంవత్సరం మొత్తం మీద కేవలం 225 కార్లే విక్రయించగలిగింది. అదే సమయంలో బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి సంస్థలు ఆకర్షణీయమైన ఫీచర్లతో పోటీగా తమ ఎలక్ట్రిక్ కార్లను విడుదల చేయడంతో టెస్లాకు గట్టి సవాల్ ఎదురైంది. ఈ పరిస్థితుల్లో భారత మార్కెట్లో తన స్థానం బలపర్చుకునేందుకు టెస్లా ఈ కొత్త ఆఫర్లతో దూకుడు పెంచుతోంది.

# సంపాదకీయం

## ప్రపంచం ఎటు పోతోంది?

- యుద్ధాలు, ఉద్రిక్తతల మధ్య శాంతి ప్రశ్న
- ఆర్థిక సంక్షోభాలు–ప్రపంచ ప్రజలపై ప్రభావం
- నాయకత్వ వైఫల్యమే ప్రపంచ సమస్యల మూలమా?

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు చూస్తే, అంతర్జాతీయ రాజకీయాలు ఒక ప్రమాదకర మలుపు వద్ద నిలిచినట్లుగా కనిపిస్తున్నాయి. ఒకవైపు యుద్ధాలు, మరోవైపు ఆర్థిక అస్థిరత, మరోవైపు వాతావరణ మార్పుల ప్రభావం ఈ మూడు కలిసి ప్రపంచ ప్రజలను అనిశ్చితిలోకి నెట్టుతున్నాయి. ఒకప్పుడు అంతర్జాతీయ సహకారం, దౌత్యం గురించి మాట్లాడిన ప్రపంచం, నేడు శక్తి ప్రదర్శన, ఆధిపత్య పోటీల వైపు మళ్లుతున్నట్లుగా అనిపిస్తోంది. ప్రాంతీయ ఘర్షణలు అంతర్జాతీయ సంక్షోభాలుగా మారుతున్నాయి. ఒక దేశంలో మొదలైన యుద్ధం, క్రమంగా అనేక దేశాలను ప్రభావితం చేస్తోంది. ఆయుధాల సరఫరా, రాజకీయ మద్దతు, ఆర్థిక ఆంక్షలు ఇవి యుద్ధాలను తగ్గించడానికంటే, మరింత పెంచుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. శాంతి చర్చలు పక్కకు నెట్టబడి, యుద్ధ భాషే ప్రధాన సంభాషణగా మారటం మానవ భవిష్యత్తుకు శుభసూచకం కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. ధరల పెరుగుదల, ఇంధన సంక్షోభం, సరఫరా గొలుసుల అంతరాయం ఇవన్నీ కలిసి సామాన్య ప్రజల జీవితాన్ని భారంగా మారుస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ సమస్యలను తట్టుకోగలుగుతున్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సమానత్వం లేదన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి. వాతావరణ మార్పులు ఇక భవిష్యత్తు సమస్యగా మిగలలేదు. అవి ప్రస్తుతం జరుగుతున్న విపత్తులుగా మారాయి. వరదలు, కరువులు, తుఫానులు, ఉష్ణోగ్రతల పెరుగుదల ఇవన్నీ ప్రపంచంలోని పేద దేశాలను ఎక్కువగా దెబ్బతీస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలు సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆచరణలో తీసుకుంటున్న చర్యలు మాత్రం తక్కువగానే ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతర్జాతీయ సంస్థల పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన సంస్థలు, పెద్ద దేశాల ప్రయోజనాల మధ్య చిక్కుకుపోయాయన్న అభిప్రాయం బలపడుతోంది. నిర్ణయాలు ఆలస్యంగా రావడం, లేదా ప్రభావవంతంగా అమలుకాకపోవడం వల్ల ప్రపంచ ప్రజల్లో నమ్మకం తగ్గుతోంది. ఇది అంతర్జాతీయ వ్యవస్థ బలహీనతను బయటపెడుతోంది. నేటి ప్రపంచానికి అవసరమైనది కొత్త ఆయుధాలు కాదు, కొత్త ఆలోచనలు. శక్తి రాజకీయాల స్థానంలో మానవ కేంద్రిత దృక్పథం రావాల్సిన అవసరం ఉంది. యుద్ధాల వల్ల గెలిచేది ఎవరూ లేరు, ఓడిపోయేది మాత్రం మానవత్వమే అన్న సత్యాన్ని ప్రపంచ నాయకులు గుర్తించాల్సిన సమయం ఇది. శాంతి, సహకారం, పరస్పర గౌరవం ఇవే ప్రపంచాన్ని నిలబెట్టే మూలస్తంభాలు. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ప్రజల పాత్ర కూడా కీలకం. ప్రశ్నించే స్వరం, శాంతి కోసం డిమాండ్ చేసే చైతన్యం పెరగాలి. ప్రభుత్వాల నిర్ణయాలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా మారినప్పుడే ప్రపంచం సురక్షిత దిశగా ప్రయాణించగలదు. యుద్ధాలకంటే శాంతి, విభజనలకంటే ఐక్యత అవసరమన్న సందేశాన్ని అంతర్జాతీయ ఎడిటోరియల్‌గా ఈ కాలం స్పష్టంగా వినిపిస్తోంది. ప్రపంచం ఎటు పోతోందన్న ప్రశ్నకు సమాధానం ఇంకా మన చేతుల్లోనే ఉంది. శక్తి పోటీలను ఎంచుకుంటామా? లేక శాంతి మార్గాన్ని ఎంచుకుంటామా? ఈ నిర్ణయమే రాబోయే తరాల భవిష్యత్తును నిర్ణయించనుంది.

వాతావరణ మార్పులు ఇక భవిష్యత్తులో వచ్చే ముప్పు కాదు. అవి ఇప్పటికే ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాస్తవం. వరదలు, కరువులు, అడవుల నాశనం, ఉష్ణోగ్రతల పెరుగుదల---ఇవి ప్రపంచంలోని పేద, బలహీన దేశాలను ఎక్కువగా దెబ్బతీస్తున్నాయి. వాతావరణ సంక్షోభానికి కారణమైన దేశాలు ఒకవైపు ఉంటే, దాని ప్రభావాన్ని అనుభవిస్తున్న దేశాలు మరోవైపు ఉండటం ప్రపంచ న్యాయంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల పాత్రపై కూడా అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రపంచ శాంతి, సహకారం కోసం ఏర్పాటైన సంస్థలు, శక్తివంతమైన దేశాల రాజకీయాల మధ్య ఇరుక్కుపోయాయన్న అభిప్రాయం పెరుగుతోంది. నిర్ణయాలు ఆలస్యంగా రావడం, లేదా ప్రభావవంతంగా అమలుకాకపోవడం వల్ల ప్రపంచ ప్రజల్లో నమ్మకం తగ్గుతోంది. అంతర్జాతీయ వ్యవస్థకు సంస్కరణలు అవసరమన్న డిమాండ్ రోజురోజుకీ బలపడుతోంది. నేటి ప్రపంచానికి అవసరమైనది మరిన్ని ఆయుధాలు కాదు, మరిన్ని యుద్ధ కూటములు కాదు. అవసరమైనది కొత్త ఆలోచన, కొత్త దృష్టి. శక్తి రాజకీయాల స్థానంలో మానవ కేంద్రిత రాజకీయాలు రావాల్సిన అవసరం ఉంది. భద్రత అంటే కేవలం సైనిక బలం కాదని, అది ఆహారం, ఆరోగ్యం, ఉపాధి, పర్యావరణ భద్రతతో ముడిపడి ఉందని ప్రపంచం గుర్తించాల్సిన సమయం ఇది. ప్రపంచ ప్రజల పాత్ర కూడా ఈ దశలో అత్యంత కీలకం. ప్రశ్నించే స్వరం, శాంతిని కోరే ఉద్యమాలు, మానవత్వానికి ప్రాధాన్యం ఇచ్చే ఆలోచనలు బలపడాలి. ప్రభుత్వాల నిర్ణయాలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా మారినప్పుడే ప్రపంచం సురక్షిత దిశగా సాగగలదు. మౌనం యుద్ధాలకు మార్గం వేసిన చరిత్రను ప్రపంచం మర్చిపోవద్దు. ప్రపంచం ఎటు పోతోందన్న ప్రశ్నకు సమాధానం ఇంకా ఖరారు కాలేదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం–శక్తి పోటీలు కొనసాగితే, ఓడిపోయేది మానవత్వమే. శాంతి, సహకారం, సమానత్వం అనే విలువలను తిరిగి కేంద్రంగా చేసుకున్నప్పుడే ప్రపంచం స్థిరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయగలదు. ఈ అంతర్జాతీయ ఎడిటోరియల్ కాలానికి ఇచ్చే ప్రధాన సందేశం అదే.సురక్షిత దిశగా సాగగలదు. మౌనం యుద్ధాలకు మార్గం వేసిన చరిత్రను ప్రపంచం మర్చిపోవద్దు. ప్రపంచం ఎటు పోతోందన్న ప్రశ్నకు సమాధానం ఇంకా ఖరారు కాలేదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం–శక్తి పోటీలు కొనసాగితే, ఓడిపోయేది మానవత్వమే. శాంతి, సహకారం, సమానత్వం అనే విలువలను తిరిగి కేంద్రంగా చేసుకున్నప్పుడే ప్రపంచం స్థిరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయగలదు. ఈ అంతర్జాతీయ ఎడిటోరియల్ కాలానికి ఇచ్చే ప్రధాన సందేశం అదే.

# మధ్యాహ్న భోజనం ను పర్యవేక్షించిన ఎంఈఓ రామచంద్రుడు





మన గళం కోడుమూరు :మండల పరిధిలోని ప్యాలకుర్తి గ్రామంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంను ఎంఈఓ రామచంద్రుడు ఆకస్మికంగా పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనంలో అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్యాలకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్ కోడుమూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లపరి పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లోని అన్ని క్లాసులను పరిశీలించారు. మొదటగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్, జిల్లా విద్యాశాఖాదిగారి ఆదేశాల ప్రకారము కచ్చితంగా స్లిప్ టెస్ట్ లో 15 మార్కులు సరాసరిగా ఉండాలని తెలిపారు. ఎవరు కూడా రైజింగ్ స్టార్ లో ఉండకూడదు అందరూ సైనింగ్ స్టార్ లో ఉండాలని తెలిపారు. ఇప్పటికే 61 రోజులు అయిపోయాయి 39 రోజులు ఉన్నాయి కాబట్టి విద్యార్థులతో ముఖ్యమైన ప్రశ్నలు ఎక్కువ మూల్యాంకనం చేపించి రాబోవు ప్రి ఫైనల్, గ్రాండ్ టెస్ట్ లో మంచి మార్కులు తీసుకురావాలని వెల్లడించారు. విద్యార్థులతో మాట్లాడుతూ మీరందరు ఇంకా శ్రద్ధగా, కష్టపడి చదవాలని స్లిప్ టెస్టుల్లో కనీసం 20 కి 15 మార్కులు తీసుకో రావాలని, గైహాజరు కాకూడదని, అనివార్య కారణాలవల్ల ఒకవేళ పరీక్ష రాయలేక పోతే మరుసటి రోజు అ విద్యార్థులు ఆ పరీక్షలు రాయాలని 9వ తేదీ నుంచి జరిగే ప్రీ ఫైనల్ పరీక్షలలో అందరు100% పాస్ కావాలని తెలిపారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను , అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లపరిలో స్లిప్ టెస్ట్ 5 భాగంగా బుధవారం జరుగుతున్న సోషల్ ఎగ్జామ్ ను కూడా పరిశీలించారు

# ఉత్సాహంగా ఉల్లాసంగా మ్యూజికల్ చైర్స్ పోటీలు

మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో శ్రీ చౌడేశ్వరి దేవి తిరుణాల సందర్భంగా జరుగుతున్న క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు మ్యూజికల్ చైర్స్ పోటీలను కుమారి లింగం భవ్యకార్తీక ప్రారంభించారు. లింగం రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం లింగం బాలక్రిష్ణయ్య, లింగం దేవిలు దాతలుగా ముందుకువచ్చి ఈ పోటీలను నిర్వహించారు. సంత మార్కెట్లో జూనియర్స్, సీనియర్స్ వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించి రెండు విభాగాలలో మూడు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ఎంతో ఆహ్లాదభరితంగా సాగిన ఈ పోటీలలో పలువురు ఆసక్తిగా మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవి తిరుణాల, క్రీడలు సాంస్కృతిక స్టీరింగ్ కమిటీ సభ్యులు లాయర్ ప్రభాకర్, నాగేశ్వరరావు, హుసేనప్పస్వామి, బెస్త వీరన్న, దయాకర్, గోవర్ధన్, పవన్ చంద్రారెడ్డి, బీ.సీ. రాజు, బలరాం, ఏకాంబరమూర్తి,సతీష్, బాలక్రిష్ణయ్య, వీరనరసింహ,



శ్రీనివాసులు, లింగం పెద్దలక్ష్మయ్య, కే గోవిందు తదితరులు పాల్గొన్నారు.


# అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం

మనగళం శ్రీశైలం : శ్రీమతి జయమ్మలోకమూర్తి, దావణగేరి, కర్ణాటక రాష్ట్రం వారు ఈ రోజు (04.02.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,116/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి హిమబిందు, యం. మల్లికార్జునలకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి. ఈ కార్యక్రమములో పర్యవేక్షకులు పి. దేవిక కూడా ఉన్నారు.




# అరికెర, ఎల్లార్థి వెళ్లే రోడ్డు పనులు ప్రారంభం

(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి అరికెర–ఎల్లార్తి వెళ్లే రూట్‌లో సుమారు ఒక కిలోమీటర్ మేర రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. చాలా కాలంగా రోడ్డు ఇరుకుగా ఉన్నందు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ఇప్పుడు పనులు మొదలవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి రాకపోకలకు అనుకూలంగా చేయాలని ప్రజలు కూటమి నాయకులకు మరియు అధికారులను కోరుతున్నారు.



# శ్రీ సింగరాజు కల్యాణి మరియు వారి బృందం, మచిలీపట్నం వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (04.02.2026) శ్రీ సింగరాజు కల్యాణి మరియు వారి బృందం, మచిలీపట్నం వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, నమశ్శివాయ, శివ శివ భవ భవ, శివుడు తాండవము చేసేను, శంకరపూజితే తదితర పలు శివకీర్తనలను విజయలక్ష్మి, ఉమ, రాధిక, రాజారామ్ తదితరులు ఆలాపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తబలా సహకారం శ్రీ దేవకిషోర్, కీబోర్డు సహకారాన్ని శ్రీరాంబాబు అందిస్తున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.





# శ్రీ దేవమ్మ, మారెమ్మ అవ్వ గ్రామ దేవరకు యాభై వేలు విరాళం అందజేసిన గుమ్మనూరు నారాయణ

(ఆలూరు మనగళం): హోలహర్వి మండలం, కామినహాళ్ గ్రామానికి చెందిన శ్రీ దేవమ్మ అవ్వ మరియు శ్రీ మారెమ్మ అవ్వ గ్రామ దేవర జాతరకు కామినహాళ్ గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు గుంతకల్ పట్టణం నందు ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఏప్రిల్ 29న జరిగే కామినహాళ్ గ్రామ దేవత శ్రీదేవమ్మా దేవత మరియు శ్రీ మారెమ్మ దేవత గ్రామ కుంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి గుమ్మనూరు నారాయణ దంపతులను ఆహ్వానించారు. అనంతరం




గుమ్మనూరు నారాయణ శ్రీదేవమ్మా దేవత మరియు శ్రీ మారెమ్మ దేవత గ్రామ దేవర జాతరకు 50వేల రూపాయలు విరాళం కామినహాళ్ గ్రామ కమిటీ



సభ్యులు మరియు గ్రామ పెద్దలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామినహాళ్ గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు మరియు కార్యకర్తలు, గుమ్మనూరు నారాయణ అభిమానులు,

## పిల్లలతో పెద్దల స్నేహం - సంతోషకరమైన కుటుంబానికి బలమైన పునాది



డెస్క్, ఫిబ్రవరి 4,మనగళం :తరం మధ్య దూరాన్ని తగ్గించే స్నేహబంధం నేటి వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య సంభాషణ తగ్గిపోతోందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు--పెద్దల మధ్య ఆలోచనలు, అభిరుచులు భిన్నంగా ఉండటంతో తరచూ దూరం ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలతో పెద్దలు స్నేహపూర్వకంగా మెలగడం కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుందని వారు సూచిస్తున్నారు. ఆదేశాలు, భయంతో కూడిన సంబంధాలకన్నా స్నేహంతో కూడిన అనుబంధం పిల్లల మనసును తెరిపించి, ఇంట్లో నమ్మకం పెంచుతుందని చెబుతున్నారు.

– పిల్లల మానసిక ఆరోగ్యానికి స్నేహమే రక్షణ

పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం ఉంటే మానసిక ఒత్తిడి తగ్గుతుందని మానసిక నిపుణులు అంటున్నారు. పెద్దలు స్నేహితుల్లా వింటే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, సమస్యలను దాచకుండా పంచుకునే అలవాటు ఏర్పడుతుందని చెబుతున్నారు. చదువు ఒత్తిడి, స్నేహ సంబంధాలు, డిజిటల్ ప్రభావాలు వంటి అంశాల్లో పిల్లలు ఎదుర్కొనే సవాళ్లను అర్థం చేసుకుని మార్గనిర్దేశం చేయడం స్నేహపూర్వక సంబంధంతోనే సాధ్యమవుతుందని వారు పేర్కొంటున్నారు.

– పెద్దలకూ లాభమే – పరస్పర అవగాహన

పిల్లలతో స్నేహం చేయడం వల్ల పెద్దలకూ లాభాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లల ఆలోచనలను వినడం ద్వారా కాలానికి అనుగుణమైన మార్పులను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని, ఓర్పు, సహనం పెరుగుతాయని అంటున్నారు. ఇంట్లో స్నేహపూర్వక వాతావరణం ఉంటే తరం మధ్య గొడవలు తగ్గి, పరస్పర గౌరవం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఇది కుటుంబాన్ని ఒకే దిశగా నడిపించే బలంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.

– స్నేహం అంటే నియంత్రణ లేనిదే కాదు

అయితే స్నేహం పేరుతో నియమాలు లేకుండా పోవడం మంచిదికాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. స్నేహంతో పాటు విలువలు, బాధ్యతలు నేర్పించడం అవసరమని చెబుతున్నారు. పిల్లల మాట వినడం, భావాలను గౌరవించడం చేయాలి కానీ తప్పు జరిగితే శాంతంగా సరిదిద్దే ధోరణి అవసరమని సూచిస్తున్నారు. స్నేహం, క్రమశిక్షణ మధ్య సరైన సమతుల్యం పాటిస్తే పిల్లలు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిల్లలతో పెద్దల స్నేహం అనేది కేవలం సంబంధం కాదు, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పెట్టుబడిగా మారుతుందని వారు చెబుతున్నారు.

## కోపం, మౌనం..
## మనసును గెలిపించే రెండు అస్త్రాలు



డెస్క్, ఫిబ్రవరి 4,మనగళం : నేటి వేగవంతమైన జీవనశైలిలో కోపం మనిషిని ఎక్కువగా వెంటాడుతున్న భావోద్వేగంగా మారిందని మానసిక నిపుణులు చెబుతున్నారు. చిన్న విషయానికే ఆగ్రహించడం, మాటలతో గాయపరచడం, ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల వ్యక్తిగత సంబంధాలు దెబ్బతింటున్నాయని వారు పేర్కొంటున్నారు. కోపం వచ్చిన సమయంలో మనసు నియంత్రణ కోల్పోయి, తర్వాత పశ్చాత్తాపపడే పరిస్థితులు ఎక్కువగా ఎదురవుతున్నాయని చెబుతున్నారు. దీర్ఘకాలంగా కోపాన్ని అణచుకోలేకపోతే అధిక రక్తపోటు, గుండె సమస్యలు, నిద్రలేమి వంటి ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

– మౌనం బలహీనత కాదు -- బలం

కోపానికి ప్రత్యామ్నాయంగా మౌనాన్ని ఎంచుకోవడం బలహీనత కాదని, అది పరిపక్వతకు సంకేతమని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి సందర్భంలో స్పందించకుండా, అవసరమైనప్పుడు మౌనం పాటించడం వల్ల పరిస్థితిని లోతుగా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందని చెబుతున్నారు. కోపంతో చెప్పే మాటలకన్నా మౌనం చాలాసార్లు పెద్ద సందేశాన్ని ఇస్తుందని, అది సంబంధాలను కాపాడడంలో సహాయపడుతుందని వారు పేర్కొంటున్నారు. మౌనం మనసుకు సమయం ఇచ్చి, ఆలోచనలకు స్పష్టత తీసుకువచ్చే సాధనంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

– సరైన సమతుల్యం అవసరం

అయితే ప్రతిసారి మౌనం పాటించడం కూడా మంచిదికాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సమస్యలను ఎప్పటికీ మాట్లాడకుండా లోపలే దాచుకుంటే మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కోపాన్ని వెంటనే వ్యక్తపరచకుండా, శాంతంగా ఆలోచించి సరైన సమయంలో, సరైన మాటలతో భావాలను వ్యక్తపరచడం ఉత్తమ మార్గమని సూచిస్తున్నారు. కోపం వచ్చినప్పుడు కొద్దిసేపు విరామం తీసుకోవడం, లోతుగా శ్వాస తీసుకోవడం, పరిస్థితి నుంచి తాత్కాలికంగా దూరంగా ఉండడం మేలు చేస్తుందని చెబుతున్నారు.

– మనసు గెలిస్తే జీవితం గెలిచినట్టే

కోపం, మౌనం రెండింటినీ సరిగ్గా వినియోగించుకోవడం జీవన కళలో ఒక ముఖ్యమైన భాగమని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కోపాన్ని నియంత్రించగలిగితే మనసు ప్రశాంతంగా ఉంటుంది, మౌనాన్ని అర్థవంతంగా పాటించగలిగితే సంబంధాలు బలపడతాయని చెబుతున్నారు. ప్రతి పరిస్థితిలో స్పందించాల్సిన అవసరం లేదని, అవసరమైన చోట మాత్రమే మాట, అవసరమైన చోట మాత్రమే మౌనం పాటించడం నేర్చుకుంటే జీవితం సులభంగా, ప్రశాంతంగా మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు. చివరికి మనసును గెలిచినవాడే నిజంగా జీవితాన్ని గెలిచినవాడని వారు గుర్తుచేస్తున్నారు.

## అందం, ఆరోగ్యం కలిపిన సహజ వరం గోరింటాకు



డెస్క్, ఫిబ్రవరి 4,మనగళం : తెలుగు సంప్రదాయాల్లో గోరింటాకు స్థానం తెలుగు ఇళ్లలో గోరింటాకు ఒకప్పటి నుంచి అనివార్యంగా ఉపయోగంలో ఉన్న సహజ మొక్క. పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక సందర్భాల్లో చేతులు--కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందం కోసమే కాకుండా ఆరోగ్య పరంగా కూడా గోరింటాకు ఎంతో మేలు చేస్తుందని పెద్దలు నమ్ముతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా ఇళ్లలో గోరింటాకు మొక్కను పెంచుకుంటూ అవసరానికి వినియోగిస్తున్నారు.

– చర్మం, జుట్టు ఆరోగ్యానికి మేలు

గోరింటాకులో సహజ శీతల గుణాలు ఉండటంతో చర్మానికి చల్లదనం ఇస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. చేతులు, కాళ్లపై గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మం మృదువుగా మారుతుందని, వేడి తగ్గుతుందని పేర్కొంటున్నారు. అలాగే గోరింటాకు పేస్ట్‌ను తలపై పెట్టుకుంటే జుట్టు బలపడుతుందని, చుండ్రు, తల వేడి వంటి సమస్యలు తగ్గుతాయని చెబుతున్నారు. సహజ హెయిర్ కండిషనర్‌లా గోరింటాకు పనిచేస్తుందని నిపుణుల అభిప్రాయం.

– శరీరానికి చల్లదనం, ఉపశమన గుణాలు

ఎండాకాలంలో గోరింటాకు శరీరానికి చల్లదనం ఇవ్వడంలో ఎంతో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. చేతులు, పాదాలపై గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత కొంతమేర తగ్గుతుందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. చిన్న చిన్న గాయాలు, చర్మంపై మంటలు ఉన్నప్పుడు గోరింటాకు ఉపశమనంగా పనిచేస్తుందని సంప్రదాయ వైద్యంలో వినియోగం ఉందని చెబుతున్నారు.

– సహజ వినియోగంలో జాగ్రత్త అవసరం

గోరింటాకు సహజమైనదైనా, మార్కెట్‌లో లభించే కెమికల్ కలిపిన గోరింటాకు వాడకంపై జాగ్రత్త అవసరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నేరుగా ఆకులను రుబ్బి తయారుచేసిన గోరింటాకే ఆరోగ్యానికి సురక్షితమని సూచిస్తున్నారు. సహజ పద్ధతిలో, పరిమితంగా వినియోగిస్తే గోరింటాకు అందం, ఆరోగ్యం రెండింటినీ అందించే విలువైన సంపదగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## షుగర్ రాకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలే మార్గం




డెస్క్, ఫిబ్రవరి 4,మనగళం : నేటి జీవనశైలిలో షుగర్ ముప్పు

అనియంత్రిత ఆహార అలవాట్లు, శారీరక కదలికల లోపం, అధిక ఒత్తిడి కారణంగా షుగర్ (మధుమేహం) సమస్య వేగంగా పెరుగుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి షుగర్ వచ్చాక జీవితాంతం నియంత్రణలో ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అందుకే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని వారు సూచిస్తున్నారు. కుటుంబ చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

– ఆహార నియంత్రణే మొదటి అడుగు

షుగర్ రాకుండా ఉండాలంటే రోజువారీ ఆహారంలో నియంత్రణ తప్పనిసరి అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అధిక చక్కెర, మైదా పదార్థాలు, జంక్ ఫుడ్ తగ్గించి సంపూర్ణ ధాన్యాలు, పప్పు దినుసులు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. తీపి పదార్థాలు తరచూ తినడం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందని, కాబట్టి వాటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. సమయానికి భోజనం చేయడం కూడా చాలా కీలకమని చెబుతున్నారు.

– వ్యాయామం, బరువు నియంత్రణ కీలకం

రోజూ కనీసం 30 నుంచి 45 నిమిషాలు వాకింగ్, సైక్లింగ్, యోగా వంటి వ్యాయామాలు చేయడం షుగర్ నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. శారీరక కదలికలు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. అధిక బరువు ఉన్నవారిలో షుగర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి బరువును నియంత్రణలో ఉంచుకోవడం చాలా అవసరమని సూచిస్తున్నారు.

– ఒత్తిడి తగ్గించుకోవడం, నిద్రకు ప్రాధాన్యం

మానసిక ఒత్తిడి కూడా షుగర్‌కు ఒక కారణంగా మారుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అధిక స్ట్రెస్ వల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి రక్తంలో చక్కెర పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రోజూ సరిపడా నిద్ర (7--8 గంటలు) తీసుకోవడం, ధ్యానం, ప్రాణాయామం వంటి అలవాట్లు పాటించడం మేలు చేస్తాయని సూచిస్తున్నారు. అలాగే క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర పరీక్షలు చేయించుకోవడం ద్వారా షుగర్‌ను ముందుగానే గుర్తించి నియంత్రించుకోవచ్చని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## చేపలు తింటే లభించే ఆరోగ్య ప్రయోజనాలు



డెస్క్, ఫిబ్రవరి 4,మనగళం : భారతీయ ఆహార సంస్కృతిలో, ముఖ్యంగా తీర ప్రాంతాలు మరియు నదీ తీర ప్రాంతాల్లో చేపలు ముఖ్యమైన ఆహారంగా కొనసాగుతున్నాయి. తక్కువ సమయంలో వండుకోవచ్చు, తేలికగా జీర్ణమవుతుంది అనే కారణాలతో చేపలకు ప్రత్యేక ఆదరణ ఉంది. మాంసాహారాల్లో ఆరోగ్యానికి అనుకూలమైన ఆహారంగా చేపలను పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ సరిపోయే ఆహారంగా చేపలు నిలుస్తున్నాయని వారు చెబుతున్నారు.

– మెదడు, గుండె ఆరోగ్యానికి మేలు

చేపల్లో ఉండే ఒమేగా--3 ఫ్యాటి యాసిడ్లు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. జ్ఞాపకశక్తి పెరగడం, ఏకాగ్రత మెరుగవడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని సూచిస్తున్నారు. అలాగే గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా చేపలు ఎంతో ఉపయోగపడతాయని, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని చెబుతున్నారు. అందుకే గుండె సమస్యలున్నవారికి కూడా చేపలను ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

– ప్రోటీన్, విటమిన్లతో శరీర బలం

చేపల్లో అధిక నాణ్యత గల ప్రోటీన్, విటమిన్--డి, విటమిన్--బీ12, కాల్షియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కండరాల బలం పెంచడంలో, ఎముకలను బలపరచడంలో సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లల ఎదుగుదలకూ, వృద్ధుల ఎముకల ఆరోగ్యానికీ చేపలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొంటున్నారు. తక్కువ కొవ్వుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంగా చేపలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి.

– సరైన వంట విధానం, పరిమితి అవసరం

ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ చేపలను సరైన విధానంలో వండుకుని తీసుకోవడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ నూనెతో వేయించిన చేపలకంటే ఉడికించినవి, ఆవిరితో వండినవి లేదా తక్కువ మసాలాలతో చేసిన కూరలు ఆరోగ్యానికి మంచివని సూచిస్తున్నారు. అలాగే తాజా చేపలను మాత్రమే వినియోగించాలి, వారానికి రెండు నుంచి మూడు సార్లు పరిమితంగా తీసుకుంటే పూర్తి ప్రయోజనాలు లభిస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమతుల్య ఆహారంలో భాగంగా చేపలను చేర్చుకుంటే ఆరోగ్యం, శక్తి రెండూ మెరుగవుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.

## వారిపై చర్యలు తీసుకోండి..!




హైదరాబాద్ ,04 ఫిబ్రవరి 2026,మనగళం, : సోషల్ మీడియాలో సెలబ్రిటీలపై ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగాయి. కొందరు కేటుగాళ్లు నకిలీ ఖాతాలు సృష్టించి సెలబ్రిటీల ఫోటోలను వక్రీకరించడం, అసభ్యంగా కామెంట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ఈ తరహా ఘటనలపై పలువురు సినీ ప్రముఖులు పోలీసులను ఆశ్రయించారు. కొందరు స్టార్లు తమ అనుమతి లేకుండా ఫోటోలు వాడుకోవద్దంటూ కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తాజాగా తెలుగు హీరోయిన్ ఈషా రెబ్బ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో తాను పోస్ట్ చేసిన ఫోటోకు ఒక వ్యక్తి అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడంతో అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు నకిలీ ఖాతా సృష్టించి ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. చిన్న చిన్న పాత్రలతో కెరీర్‌ను ప్రారంభించిన ఈషా రెబ్బ క్రమంగా హీరోయిన్‌గా, సెకండ్ హీరోయిన్‌గా అవకాశాలు దక్కించుకుని గుర్తింపు పొందింది. ఎన్టీఆర్ నటించిన అరవింద సమేత సినిమాలో హీరోయిన్ స్నేహితురాలిగా నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఇటీవలి కాలంలో ఓం శాంతి శాంతి శాంతిః చిత్రంలో నటించి విజయాన్ని అందుకుంది. సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న దాడులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పలువురు సినీ ప్రముఖులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈషా రెబ్బ ఫిర్యాదు ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఆనంద క్షణాలను అసహ్యంగా మార్చకండి..!



హైదరాబాద్ ,04 ఫిబ్రవరి 2026,మనగళం, : మెగా కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించడంతో మెగాస్టార్ చిరంజీవి కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తించారు. అయితే ఈ సంతోషకరమైన క్షణాన్ని కొందరు నెటిజన్లు గతంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలను తిరిగి తెరపైకి తెచ్చి ట్రోలింగ్ చేయడంతో వివాదం మొదలైంది.గతంలో ఓ సినిమా ప్రమోషన్ సందర్భంగా చిరంజీవి మెగా వారసుడి గురించి చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని, మహిళలను చులకనగా చూశారని కొందరు విమర్శలు చేశారు. ఈ ట్రోలింగ్‌పై మెగా కోడలు, నటి లావణ్య త్రిపాఠి ఘాటుగా స్పందించారు. ఆనంద క్షణాలను విషపూరితంగా మార్చొద్దని ఆమె ట్విట్టర్‌లో కౌంటర్ ఇచ్చారు."సాధారణంగా ఇలాంటి వ్యాఖ్యలను పట్టించుకోను. కానీ ఈసారి స్పందించకుండా ఉండలేకపోయాను. ఓ సంతోషకరమైన క్షణాన్ని ఇలా అసహ్యంగా మార్చడం చాలా నీచమైన ఆలోచన. చిరంజీవి కుటుంబంలోని మహిళలను, ముఖ్యంగా మనవరాళ్లను ఎంతో ప్రేమగా, గౌరవంగా చూసుకుంటారు. ఆయన కుటుంబానికి ఇచ్చే విలువ చాలా మందికి సాధ్యం కాదు. ఆయన చేసే పనుల్లో కనీసం కొంతైనా చేయలేని వారు ఆయన వ్యక్తిత్వంపై విమర్శలు చేయడం సరికాదు" అంటూ లావణ్య త్రిపాఠి పేర్కొన్నారు.లావణ్య స్పందనకు మెగా అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు మద్దతు తెలిపారు. కుటుంబ ఆనందంపై ట్రోలింగ్ చేయడం సరికాదని, వ్యక్తిగత వ్యాఖ్యలను సందర్భానుసారంగా వక్రీకరించడం తప్పని నెటిజన్లకు హితవు పలికారు.

## ధనుష్‌తో పెళ్లి వార్తలపై మృణాల్ క్లారిటీ



హైదరాబాద్ ,04 ఫిబ్రవరి 2026,మనగళం, :ఇటీవల సోషల్ మీడియాలో నటి మృణాల్ ఠాకూర్, నటుడు ధనుష్ మధ్య ప్రేమాయణం సాగుతోందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ పలు వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ పుకార్లపై మృణాల్ తాజాగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. ధనుష్ తనకు అన్నయ్య లాంటి వారని, తమ మధ్య కేవలం వృత్తిపరమైన సంబంధం మాత్రమే ఉందని ఆమె ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న నిరాధార వార్తలపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

తన వ్యక్తిగత జీవితంపై అనవసర ఊహాగానాలు చేయడం సరికాదని మృణాల్ అన్నారు. ఏదో పెద్ద రహస్యాన్ని దాస్తున్నానని, అందుకే మౌనంగా ఉంటున్నానంటూ ప్రచారం చేయడం పూర్తిగా తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. తన జీవితం గురించి ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టంగా చెప్పారు.

తాను సాధించిన పేరు, గుర్తింపు ఒక్కరోజులో రాలేదని, వాటి వెనుక ఎన్నో ఆడిషన్లు, తిరస్కరణలు, నిద్రలేని రాత్రులు ఉన్నాయని మృణాల్ గుర్తు చేశారు. తన కష్టాన్ని అర్థంలేని ఒక్క పుకారుతో తక్కువ చేసి చూడటం బాధాకరమని ఆమె వ్యాఖ్యానించారు. వృత్తిపరంగా మృణాల్ ప్రస్తుతం బిజీ షెడ్యూల్‌తో కొనసాగుతున్నారు. తెలుగుతో పాటు బాలీవుడ్‌లో ఆరు సినిమాల్లో నటిస్తున్నారు. తెలుగులో అడివిశేష్ సరసన 'డెకాయిట్' సినిమాలో నటిస్తుండగా, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ చిత్రంలో కూడా ఆమె హీరోయిన్‌గా కనిపించనుంది. అలాగే ఆమె నటించిన 'ధో దివానే సహెర్ మెయిన్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

## మెగా 158 అప్‌డేట్: చిరంజీవి సినిమాలో 'ధురంధర్' హీరోయిన్ ఎంట్రీ..!



హైదరాబాద్ ,04 ఫిబ్రవరి 2026,మనగళం, : మెగాస్టార్ చిరంజీవి ఇటీవల 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయోత్సాహంలోనే సమ్మర్‌లో ఆయన నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాల తర్వాత చిరంజీవి దర్శకుడు బాబీతో కలిసి 'మెగా 158' ప్రాజెక్ట్ చేయబోతుండటం ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఓ ఆసక్తికరమైన వార్త హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో చిరంజీవి కుమార్తె పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్ సారా అర్జున్‌ను దాదాపుగా ఫిక్స్ చేసినట్లు సమాచారం. అలాగే తాజాగా 'ధురంధర్' సినిమాలో కనిపించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ నటి ఈ పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కథలో కీలకంగా ఉండటంతో, ఈ ఎంపికపై మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలుస్తోంది.

మెగా అభిమానులు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నారు. చిరంజీవి కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా 'మెగా 158' నిలవబోతుందనే టాక్ వినిపిస్తోంది. కథ పరంగా కొత్తదనం, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో పాటు పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు కూడా ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కన్నడకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నారు. హీరోయిన్ ఎంపిక, మిగతా నటీనటుల వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం.



# భాజపాను మరింత పటిష్టపరచాలి











**- అందరి లక్ష్యం అదే కావాలి**
**- రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి**





(మన గళం,కర్నూలు నరసింహారెడ్డి నగర్) : భారతీయ జనతా పార్టీని మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఆకాంక్షించారు. పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు,కార్యకర్త లక్ష్యం అదే కావాలని ఆయన కోరారు. నగరంలోని స్థానిక నరసింహారెడ్డి నగర్ లో ఉన్న హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్స్ లో ఉన్న మినీ బాంకెట్ హాల్ లో కిసాన్ మోర్చా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం,కరువు పనులు,పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలన,రైతన్నల ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజెప్పడమే లక్ష్యంగా రాష్ట్ర కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాల పర్యటనలు చేపట్టామన్నారు. మరే ఇతర పార్టీల్లో లేని విధంగా తమ పార్టీలో 10,20 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్యకర్తలున్నారని, పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తమ పర్యటనలు సాగుతున్నాయన్నారు. ఆంధ్ర రాష్టంలో పార్టీని బలోపేతం చేసి, అధికారాన్ని కైవశం చేసుకోవడంతో పాటు,కర్నూలు జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించు కోవడమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్,రాష్ట్ర భాజపా నేత నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రైతు సంక్షేమాన్ని కాంక్షించే పార్టీ అన్నారు. దేశానికి రైతన్నలే వెన్నుముక అని, వారి శ్రేయస్సే లక్ష్యంగా భాజపా వ్యవసాయ రంగాన్ని ఆదుకునే విషయంలో ముందుందన్నారు. కిసాన్ మోర్చా నేతలు పార్టీ పటిష్టత కోసం జిల్లాల పర్యటనలు చేస్తున్నారని, వారితో మమేకమై కార్యకర్తలు,నేతలు పని చేయాలని కోరారు. భాజపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామక్రిష్ణ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాజెక్టులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. సాగునీటి సమస్యలు సైతం ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి పాటుపడాలని తాము జిల్లా ఇంఛార్జ్ మంత్రి నిమ్మల రమానాయుడిని కోరామన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రైతన్నల శ్రేయస్సుకు ప్రధాని మోదీ ఎన్నెన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు అతిథులకు శాలువాలు కప్పి, సత్కరించారు. కార్యక్రమంలో బిజెవైఎం అధ్యక్షుడు సునీల్ రెడ్డి, నాయకులు పోలంకి రామస్వామి, పరిగల మురళీక్రిష్ణ, మురళీ నాయుడు, గీతామాధురి, మాలతి, జయశ్రీ, రమణ, తదితరులు పాల్గోన్నారు.

## భారత్ - పాక్ మ్యాచ్ కచ్చితంగా జరుగుతుంది..!




ముంబై , 04 ఫిబ్రవరి 2026 ,మన గళం, : టీ20 ప్రపంచ కప్ సమీపిస్తున్న వేళ పాకిస్థాన్ తీసుకున్న వైఖరి తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ భారత్‌తో మ్యాచ్‌లు ఆడబోమని పాకిస్థాన్ ప్రకటించడం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఐసీసీ హెచ్చరికలు చేసినప్పటికీ పాక్ తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో ఈ అంశం మరింత వేడెక్కింది.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్--పాకిస్థాన్ మ్యాచ్ నూటికి నూరు శాతం జరుగుతుందని ఆయన స్పష్టం చేశాడు. మరో నాలుగు లేదా ఐదు రోజుల్లో పాకిస్థాన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందని అంచనా వేశాడు. భారత్--పాక్ పోరును చూడాలని తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అశ్విన్ పేర్కొన్నాడు. పాకిస్థాన్ మ్యాచ్ ఆడకపోతే భారీ ఆర్థిక నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అశ్విన్ హెచ్చరించాడు. ప్రసార సంస్థలు పెద్ద మొత్తంలో నష్టపోతాయని, ఇతర దేశాల క్రికెట్ బోర్డులకూ ఇబ్బందులు తప్పవని అన్నాడు. ఐసీసీ సమావేశంలో ఈ అంశం తప్పకుండా చర్చకు వస్తుందని తెలిపారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు రావడం కూడా కష్టమవుతుందని అభిప్రాయపడ్డాడు.

భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో మ్యాచ్‌లు ఆడుతున్నాయని గుర్తు చేసిన అశ్విన్, వేదిక అనేది అసలు సమస్యే కాదని స్పష్టం చేశాడు. ఓ ప్రత్యర్థితో ఆడను అని చెప్పడం ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించాడు. చివరికి పాకిస్థాన్‌కు పాకిస్థానే పెద్ద శత్రువని, ఈ పరిస్థితి మొత్తం వారి మైండ్‌సెట్ వల్లే ఏర్పడిందని అశ్విన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అభిషేక్ శర్మదే..!

ముంబై , 04 ఫిబ్రవరి 2026 ,మన గళం, : పొట్టి ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి ముందే ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో కొంతకాలంగా అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఈసారి కూడా నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో రెండు మ్యాచుల్లో విఫలమైనప్పటికీ మొత్తం 917 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగడం విశేషం. ఈ జాబితాలో అభిషేక్ శర్మ తర్వాత ఇంగ్లాండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ 834 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మూడో స్థానంలో ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ 769 పాయింట్లతో ఉన్నాడు. భారత ఆటగాళ్లు తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ కూడా టాప్ 10లో చోటు దక్కించుకోవడం భారత అభిమానులకు ఉత్సాహాన్నిచ్చే విషయం. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ తాజా ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి పడిపోయాడు. గత నెలలో శస్త్రచికిత్స కారణంగా జట్టుకు దూరమైన తిలక్ వర్మ ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు తెలుస్తోంది. అమెరికాతో భారత్ 'ఏ' జట్టు ఆడనున్న వార్మప్ మ్యాచ్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాత ప్రధాన జట్టుతో కలవనున్నాడు. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తాజా ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం దక్కించుకున్నాడు. ఇటీవల మంచి ఫామ్‌లోకి వచ్చిన సూర్య ఆరో స్థానానికి చేరుకుని 728 రేటింగ్ పాయింట్లు సాధించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో సెంచరీ సాధించిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ర్యాంకింగ్స్‌లో భారీగా ఎగబాకాడు. ఏకంగా 32 స్థానాలు ఎగబాకి 32వ స్థానానికి చేరుకోవడం విశేషం. ప్రపంచ కప్ గ్రూప్ దశలో భారత తుది జట్టులో చోటు దక్కితే, రాబోయే రోజుల్లో ఇషాన్ టాప్ 10లోకి చేరే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.